# మన పురాణములు

కీ శే డి. నాగసిద్దారెడ్డి, తిరుపతి.

భారతీయుల ఆధ్యాత్మిక సంపదకు వేదములు, వేదాంగములు, ఉపనిషత్తులు, ధర్మ శాస్త్రములు, ఇతిహాసములు, పురాణ ములు మున్నగునవి మూలకందములు. ధర్మార్థ కామ మోక్షములనెడి చతుర్విధ పురుషార్థములను సాధించి తరింపవలెనన్న మన ప్రాచీన సంస్కృతి యందలి సారమును, తదౌన్నత్యమును గ్రహింపక తప్పదు. అందుకు వేదాదులే శరణ్యము. కాని అవి సర్వజనసులభ సాధ్యములు గావు. అందలి పరమార్థమును సుబోధము చేయగలిగిన మహనీయ సాధనములు పురాణములు. ఉపనిషద్వేదవేదాంగ రహస్యములను, సృష్టి స్థితి విలయాత్మకుడగు పరమాత్మని పరతత్త్వ స్వరూపమును, కథోపాఖ్యానముల మూల మున సామాన్య జనులకు సైతము విదితము చేయు సామర్థ్యముగల సారస్వత మూర్తులీ పురాణములే. సంఘ జీవి యగు మానవుడు నైతికముగ పతనము నంది ధర్మ వ్యతిరిక్తుడై సమాజమునకు భయావహుడైనప్పుడతనిని ధర్మ బాహ్యుని గానీక నైతికపు విలువలను మిత్రునివలె ప్రబోధించుచు సంఘ శ్రేయోగామిగ మరల్చుట కవి యెంతేని సమర్థములు. అందుచే నివి మిత్రసమ్మతములని పేర్కొనబడినవి. ప్రాచీన వాఙ్మయము పురాణ ప్రశస్తినిగూర్చి పొగడినవిధమును తిలకింపుడు.

**పురాణ ప్రాశస్త్యము**

ఋగ్వేదం భగవో ధ్యేమి
యజుర్వేదం సామవేద మథర్వణమ్
చతుర్థమితిహాస పురాణం
పంచమం వేదానాం వేదమితి.

--ఛాందోగ్యోపనిషత్తు

విరాట్పురుషునికి శ్రుతి స్మృతులు రెండును నేత్రములు, పురాణము హృదయము. దీనిచే చెప్పబడినది ధర్మము. అది మరెక్కడా చెప్పబడ లేదు.

భగవంతుడా! ఋగ్యజుస్సామము లను, నాల్గవది యగు అథర్వణ వేదమును, వేదములలోనైదవదగు ఇతిహాస పురాణము లను చదువుచున్నాను.

వేదా ప్రతిష్ఠితా స్సర్వే
పురాణేష్వే సర్వదాః

సమస్త వేదములను సదా పురాణ ముల యందే ప్రతిష్ఠితములైయున్నవి.

వేదవ న్నిశ్చలం మన్యే
పురాణార్థం ద్విజోత్తమాః
వేదాః ప్రతిష్ఠితా స్సర్వే
పురాణే నాత్ర సంశయః

–స్కాందపురాణం

ద్విజోత్తములారా! వేదమువలె పురాణ ప్రతిపాద్యమగు అర్థముగూడ శాశ్వతమైనది. సమస్త వేదములు పురాణమునందే ప్రతిష్ఠితములై యున్నవి. ఇందు సందేహము లేదు.

యో విద్యాచ్చతురో వేదాన్
సాంగోపనిషదో ద్విజః
న చేత్పురాణం సంవిద్యా
న్నైవ స స్యాద్విచక్షణః

--వాయు పురాణం

ఏ ద్విజుడు సాంగోపనిషత్తులైన నాలుగు వేదముల నెరింగియు, పురాణము నెరుంగడో అట్టివాడు విచక్షణుడని అనిపించు కొనడు.

శ్రుతిస్మృతీ ఉభౌ నేత్రే
పురాణం హృదయం స్మృతమ్
ఏత త్త్రయయుక్త ఏవ స్యాద్ధర్మో
నాన్యత్ర కుత్రచిత్.

--దేవీ భాగవతము

# రచయిత (త్రు)లకు

# ముఖ్య గమనిక



★ చాలామంది రచయితలు సప్తగిరికి తమ రచనలు పంపుతున్నారే తప్ప స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జత చేయటం లేదు.

★ దీనివల్ల సప్తగిరి ప్రచురణకు అంగీకరించని రచనలను త్రిప్పి పంపడానికి సాధ్యం కావడంలేదు. మాకు చాలా ఇబ్బంది కలుగుతోంది. అదే విధంగా రచన ప్రచురణ విషయం తెలియక రచయితలు కూడ ఇబ్బందికి గురి అవుతున్నారు.

★ కావున ప్రతి రచయిత తమ రచనతోపాటు స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవర్లు తప్పనిసరిగా జతచేయాలని కోరుతున్నాము.

★ మన దేవాలయాలు శీర్షికకు రచనలు పంపేవారు తప్పనిసరిగా ఫోటోలు జతచేయాలి. లేనిచో రచన పరిశీలింపబడదు.

సంపాదకుడు

విరాట్పురుషునికి శ్రుతి స్మృతులు రెండును నేత్రములు, పురాణము హృదయ మని చెప్పబడినది. దీనిచేత చెప్పబడినదే ధర్మము. అది వేరొక్క చోట ఎందును చెప్పబడ లేదు.

ఇతిహాస పురాణాభ్యాం
వేదం సముపబృంహయేత్
బిభేత్యల్పశ్రుతా ద్వేదో
మా మయం ప్రతరిష్యతి.

–భారతము

ఇతిహాసపురాణములచేత వేదమును విస్తరింపవలెను. అరకొరగా చదివిన వాని నుండి వీడు నన్ను మోసగించునని వేదము భయపడుచున్నది.

అన్య మహతో భూతస్య
నిశ్వసితమేతద్యదృగ్వేదో
యజుర్వేద స్సామవేదో
థర్వాంగిరస ఇతిహాస పురాణమ్.

--వాజసనేయ బ్రాహ్మణోపనిషత్తు

ఋగ్యజుస్సామాథర్వ వేదములు, ఇతిహాస పురామములు ఆ మహా భూతము యొుక్క (పర బ్రహ్మవుయొుక్క) నిశ్వాసములు మాత్రమే.

శ్రుణు మోహిని మద్వాక్యం
వేదో యం బహుధా స్థితః
యజ్ఞకర్మ క్రియావేదః
స్మృతిర్వేదో గృహాశ్రమే
స్మృతిర్వేదః క్రియావేదః
పురాణేషు ప్రతిష్ఠితః
పురాణ పురుషాజ్జాతం
యథేదం జగదద్భుతమ్
తథేదం వాఙ్మయం జాతం
పురాణేభ్యో న సంశయః
వేదార్థా దధికం మన్యే
పురాణార్థం వరాననే.

--నారదీయము

ఓ మోహినీ! నా మాట వినుము! వేదములు వివిధ రూపములు గలవి. యజ్ఞ కర్మములందు క్రియావేదమనియు, గృహస్థా శ్రమమున స్మృతివేదమనియు వ్యక్తమైనవి. పురాణములయందే స్మృతిర్వేద క్రియా వేదములు ప్రతిష్ఠింపబడినవి. అద్భుతమైన ఈ ప్రపంచము పురాణ పురుషునినుండి పుట్టినట్లే ఈ వాఙ్మయమంతయు పురాణముల నుండియే పుట్టినది. కావున ఓ వరాననా! వేదార్థముకంటె పురాణార్థమే అధికమని భావించుచున్నాను.

పురాణం సర్వ శాస్త్రాణాం
ప్రథమం బ్రహ్మణా స్మృతమ్
అనంతరం చ వక్త్రేభ్యో
వేదాస్తస్య వినిర్గతాః.

--వాయు పురాణం

సర్వ శాస్త్రములలో పురాణము మొదటిదని బ్రహ్మచే చెప్పబడినది. ఆ పిమ్మటనే అతని ముఖముల నుండి వేదములు బయలువెడలినవి.

## నిర్వచనం

ఇట్లనేక విధముల వినుతింపబడిన ఈ పురాణములు నీతి ధర్మములకు నిలయ ములు, కర్మవ్యాకర్తవ్య ప్రబోధకములు. వేదములవలె మిక్కిలి ప్రాచీనములైయున్నవి పురాణ శబ్దమును నిఘంటువులు, పురాణములు నిర్వచించిన విధ మిది.

''పురానవం భవతి పురాణమ్''

–యాస్కనిరుక్తము

(పాత దయ్యును క్రొత్తదగుట వలన పురాణము)

''పురా భవమితి పురాణమ్''

--శబ్దకల్పద్రుమము

(పూర్వము కలిగినది కావున పురాణము)

''పురా పూర్వస్మిన్ భూతమితి పురాణమ్''

--అమరకోశము

పూర్వము జరిగినది కావున పురాణము

''పురా నీయతే ఇతి పురాణమ్''

--వాచస్పత్యము

(ప్రాచీన మయ్యు ఇపుడు మన చేత గ్రహింపబడుచున్నది కాన పురాణము)

''యస్మాత్పురాహ్యనక్తీదం
పురాణం తేన నా స్మృతమ్
నిరుక్త మన్య యో వేద
సర్వపాపైః ప్రముచ్యతే''.

--వాయు పురాణము

(పూర్వ విషయమును వ్యక్తము చేయు చున్నది కావున ఇది పురాణము. దీని నిర్వచనమును తెలిసికొన్నవాడు సమస్త పాపముల నుండి విముక్తుడగును.)

''పురా పరంపరాం వష్టి
పురాణం తేన వై స్మృతమ్''

--పద్మపురాణము

(ప్రాచీన కాల పరంపరను చెప్పునది కావున పురాణము).

''యస్మాత్పురా హ్యభూచ్చైతత్
పురాణం తేన తత్స్మృతమ్''

--బ్రహ్మాండపురాణము

(పూర్వ మెపుడో జరిగినది కావున పురాణము.)

''పురాతనస్య కల్పస్య
పురాణాని విదుర్బుధాః''

--మత్స్య పురాణము

(పూర్వ యుగమునకు సంబంధించిన వానిని పురాణములని పండితు లెరుంగుదురు.)

''ప్రాగ్వృత్త కథనం పురాణమ్''

--శుక్రనీతి

(ప్రాచీన వృత్త కథనమే పురాణము.)

ఈ నిర్వచనము లన్నియు ఇట్లుండ ''పురా పి నవమ్ పురాణమ్'' -- అను ఒక నిరుక్తి మిక్కిలి ప్రచారము నందున్నది. పురాణములు ప్రాచీనములే యైనను అందు నవీన గాథా విశేషము లెన్నియో చేరుచు వచ్చుట వల్లను పరతత్త్వ స్వరూపమును భిన్న భిన్న మార్గములలో వివరించు చుండుటవల్లను ఇవి నిత్య నూతనములని ప్రస్తుతింపవచ్చును. బ్రహ్మపదార్థ విజ్ఞానము నిత్య నూతనమే గదా!

## లక్షణము

పురాణముల యందలి వస్తు తత్త్వము ననుసరించి వీనికి ప్రాచీనులు పెక్కురు లక్షణ నిర్ణయ మొనర్చిరి. వానిలో అమరసింహుడు కావించిన ఈ క్రింది లక్షణము ప్రాచుర్యము నందియున్నది.

సర్గశ్చ ప్రతి సర్గశ్చ
వంశో మన్వంతరాణి చ
వంశాను చరితం చేతి
పురాణం పంచలక్షణమ్.

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరితము అనెడు ఈ ఐదు లక్షణములు గలది పురాణమని భావము. మార్కండేయ, విష్ణు, కూర్మ, అగ్ని, మత్స్య, వాయు పురాణాదులు కూడ ఈ పంచ లక్షణములను చక్కగ నిర్వచించినవి. సర్గము = సృష్టి స్థితి లయము లతో కూడిన బ్రహ్మాండోత్పత్తి; ప్రతి సర్గము లేక విసర్గము= కల్పానంతరము జరుగు పునస్సృష్టి; వంశము దేవ బ్రహ్మర్షుల యొక్కయు, దేవయోనుల యొక్క గోత్రానుక్రమము; మన్వంతరము= స్వాయంభువాది చతుర్దశ మనువుల చరిత్ర, వంశానుచరితము=సూర్యచంద్రాది వంశము లందు జన్మించిన రాజన్యుల వృత్తాంతము అను ఈ ఐదు విషయములు పురాణముల యందు వివరింపబడి యుండును. ఈ పంచ లక్షణ సూత్రమును మనము సునిశిత దృష్టితో పరిశీలించిన ఎడల ప్రపంచోత్పత్తి వికాసక్రమ కథన మిందు గోచరమగును. పురాణము లన్నియు దాదాపుగ ఈ లక్షణములకు కట్టుబడి యుండుట చేత పురాణ వాఙ్మయమునకీ పంచలక్షణ సూత్రము ప్రాణాధారమని పరిగణింపవచ్చును. పురాణములయందీ విషయములు మాత్రమే గాక భక్తి జ్ఞాన వైరాగ్యాదులు, వైద్య, సంగీత, జ్యోతిష, గణిత, వ్యాకరణ, ఛందో లంకార, శిల్ప, నాట్యాది సమస్త విషయములును చోటు చేసికొన్నవి. ఇవి అన్నియు ప్రతి పురాణము నందు నుండునని చెప్పలేము. పురాణ వాఙ్మయమును సమష్టిగపరిశీలించినచో వీని నన్నిటిని గుర్తింపగలము.

పురాణములన్నియు ఈ పంచ లక్షణములకే కట్టుబడి లేవు. ఇవి మహా పురాణ, ఉప పురాణ భేదముచే ద్వివిధము లనియు, పంచలక్షణ సూత్రము పురాణము లకు మాత్రమే వర్తించుననియు, మహా

పురాణములు దశ లక్షణ సమన్వితము లనియు, భాగవత పురాణము ఆ దశ లక్షణముల నిట్లు పేర్కొన్నది.

పురాణ లక్షణం బ్రహ్మన్
బ్రహ్మర్షిభిర్ని రూపితమ్
శ్రుణుష్వ బుద్ధి మాశ్రిత్య
వేద శాస్త్రాను సారతః
సర్గో స్యాథ విసర్గశ్చ
వృత్తీ రక్షాన్త రాణి చ
వంశో వంశానుచరితం
సంస్థా హేతురపాశ్రయః
దశభిర్ల క్షణైర్యుక్తం
పురాణం తద్విదో విదుః
కేచిత్పంచవిధం బ్రహ్మన్
మహదల్పవ్యవస్థయా.

సర్గము, విసర్గము, వృత్తి, రక్ష, మన్వంతరము, వంశము, వంశాను చరితము, సంస్థ హేతువు, అపాశ్రయము అనునవి పురాణ దశ లక్షణములని దీనిభావము. వీని వివరణ మిది--

1. సర్గము = బ్రహ్మ సృష్టి; 2. విసర్గము=దక్షుడు, కశ్యపుడు మొదలగు ప్రజాపతులు కావించిన సృష్టి; 3. వృత్తి= ప్రాణుల కావశ్యకము లగు ఆహారాది జీవికా సాధనములు; 4. రక్ష =దుష్టసంహారమునకై భగవంతుడు తాల్చిన అవతారములు, లీలలు; 5. మన్వంతరము = స్వాయంభువు మున్నగు మనువుల చరిత్ర, వారి కాలము నందలి ధర్మాదులస్థితి, 6. వంశము = దేవయోనుల, బ్రహ్మర్షుల గోత్రాను క్రమము; 7. వంశానుచరితము= సూర్యచంద్రాది వంశజు లగు రాజన్యుల చరిత్ర; 8. సంస్థ=ప్రళయము, 9. హేతువు=సృష్టికి కారణభూతుడైన జీవుని గూర్చిన వివరము; 10. అపాశ్రయము= జగద్విషయమున పరమేశ్వరుని సాక్షి మాత్రత్వము.

బ్రహ్మవైవర్త పురాణము కూడ భాగవతమును బలపరచుచు మహా పురాణములకు దశాధిక లక్షణము లుండునని ఇట్లు నిర్దేశించినది.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ
వంశో మన్వంతరాణి చ
వంశాను చరితం విప్రః
పురాణం పంచ లక్షణమ్
ఏతదుప పురాణానాం
లక్షణం కథయామి తే
సృష్టిశ్చాపి విసృష్టిశ్చ
స్థితిస్తేషాం చ పాలనమ్
కర్మణాం వాసనా వార్తా
మానూనాం చ క్రమేణ చ
వర్ణనం ప్రళయానాం చ
మోక్షస్య చ నిరూపణమ్
ఉత్కీర్తనం హరే రేవ
దేవానాం చ పృథక్ పృథక్
దశాధికం లక్షణం చ
మహతాం పరికీర్తితమ్.

(సృష్టి, విసృష్టి, స్థితి, పాలనము, కర్మ వాసన, మనుప్రకాశనము, ప్రళయము, మోక్ష నిరూపణము, హరినామకీర్తనము, వివిధ దేవతల గుణవర్ణనము-అనునవి మహా పురాణ లక్షణములు). అందుచేతనే శ్రుతి స్మృతుల యందు కానరాని సర్వ ధర్మాది విషయములను గూడ పురాణములు బోధించుచున్నవనియు, కేవలము కొన్ని లక్షణములకు మాత్రమే పురాణములు కట్టుబడవనియు, వానియందు లేనిది లేదనియు నారదీయ పురాణమిట్లు కీర్తించినది.

''యన్నదృష్టం హివేదేషు
తత్సర్వం లక్ష్యతే స్మృతౌ
ఉభయోర్యన్న దృష్టం హి
తత్పురాణైః ప్రణీయతే''

ఆధునిక విమర్శకుల సైతము పురాణ లక్షణములను నిర్దేశింప అసాధ్యమని తెల్పుచు ''మానవ జీవితము నందలి సమస్తాంశములను స్పృశించు వస్తువేదైనను పురాణమున నుండవచ్చు'' అని పురాణములలోని అనంత తత్త్వమును కొనియాడిరి.

(వేదములలో దృష్టి గోచరము కానిది స్మృతులలో కనిపించును. ఆ రెం డింటి యందును కన్పట్టనిది పురాణముల చేత నిరూపింపబడుచున్నది.)

(మిగతా వచ్చే సంచికలో)

**బస్సు ప్రయాణమే సురక్షితం**

- **తిరుపతి తిరుమల మధ్య ఘాటురోడ్డులో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థవారి బస్సులలో ప్రయాణం చేయడమే సురక్షితము.**
- **సాధ్యమైనంతవరకు ప్రైవేటు వాహనాలపై తిరుమల ప్రయాణం చేయకండి.**
- **ప్రైవేటు వాహనాలలో నిర్ణయించిన సంఖ్య కన్న ఎక్కువ మంది ప్రయాణించడం ప్రమాదకరం.**